ప్రజాశక్తి
ఆదివారం 18 జూన్ 2023
5
శ్రీకాకుళం



నేడు ఎంఇఒ-2 పోస్టులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఖాళీగా ఉన్న మండల విద్యాశాఖాధికారి-2 పోస్టులకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి తిరుమల చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాపరిషత్ యాజమాన్యం పరిధిలోని పాఠశాలల నుంచి సీనియార్టీ ప్రాతిపదికన నియమించేందుకు నగరంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లో పొందుపరిచిన సీనియార్టీ ప్రాప్తికి ఈ నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అర్హులైన ఉపాధ్యాయులు ధ్రువపత్రాలు, సర్వీస్ రిజిస్టర్‌తో తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

అధికారులు నిద్రపోతున్నారా?

- భూ ఆక్రమణల తొలగింపులో అలసత్వం తగదు
- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతుంటే, అధికారులు నిద్రపోతున్నారా అని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆమదాలవలస నియోజకవర్గంలోని అధికారులు, తహశీల్దార్లు, సర్వేయర్లతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్రమణదారులు ఎంతటి వారైనా ఉపేక్షించరాదన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు గానీ, నిరుపేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలన్నా భూమి గగనమవుతోందన్నారు. ఇలాంటి వాటికి చివరకు ప్రభుత్వమే భూసేకరణ చేయాల్సి వస్తోందన్నారు. గ్రామాల రికార్డుల వారీగా పంచాయతీ చెరువులు, ఇరిగేషన్ చెరువులు, పోరంబోకు స్థలాలు, కొండ పోరంబోకు స్థలాలు, కాలువ గట్లలో ఆక్రమిత స్థలాలతో పాటు ఏ ప్రభుత్వ శాఖకు చెందిన స్థలమైనా ఆక్రమణదారుల గుప్పిట్లో ఉంటే వాటిని వెంటనే ఖాళీ చేయించాలని సూచించారు. అవసరమైతే చట్టపరమైన చర్యలకు ఉపక్రమించాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలను కాపాడుకోవడం ద్వారా ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించిన వారిగా నిలవాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

నియోజకవర్గం పరిధిలోని ఆమదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి, పొందూరు మండలాలతో పాటు ఆమదాలవలస మున్సిపాల్టీ పరిధిలోని ప్రభుత్వ భూముల వివరాలపై సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. సమీక్షా సమావేశానికి సబ్ డివిజన్ రెవెన్యూ అధికారులు, ఆమదాలవలస తహశీల్దార్ హాజరు కాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రవిసుధాకర్, తహశీల్దార్లు, ఆర్ఐలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

అందరినీ రెగ్యులర్ చేయాలి

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ టీచర్స్ వర్కర్స్ జెఎసి కన్వీనర్ బి.మురళి డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై జెఎసి ఆధ్వర్యాన నగరంలోని రిమ్స్ వైద్య కళాశాల, బోధనాస్పత్రి ఆవరణలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామని వైసిపి ప్రభుత్వం హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. జూన్ 2, 2014 నాటికి ఐదేళ్లు సర్వీస్ పూర్తి చేసుకున్న 6,667 మందిని మాత్రమే రెగ్యులర్ చేస్తామని ప్రకటించడం అందుకు భిన్నంగా ఉందన్నారు. ఎన్నికల ముందు అందరినీ రెగ్యులర్ చేస్తామని చెప్పి, ఇప్పుడు అందుకు భిన్నంగా ప్రకటన చేయడం మూడు లక్షల మంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను మోసగించడమేనన్నారు. డిసెంబర్ 31, 2022 నాటికి పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, భవిష్యత్‌లో ఉద్యోగికి మూడు, ఐదేళ్లు సర్వీసు పూర్తయిన వెంటనే రెగ్యులర్ చేసేలా నిర్దిష్ట ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు పోరాటానికి, భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించేందుకు ఈనెల 18న విజయవాడలో రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సుకు అన్ని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘాల నాయకులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం 18న రాష్ట్ర సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు జి.సోమేశ్వరరావు, రిమ్స్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, జి.లక్ష్మణ, నర్సింగరావు, టి.భాస్కరరావు, డి.వి రమణ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు


ప్రోత్సాహకాల నమూనా చెక్కును అందజేస్తున్న స్పీకర్, మంత్రి, కలెక్టర్

ప్రతిభకు ప్రభుత్వ ప్రోత్సాహం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రతిభ గల విద్యార్థులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. జగనన్న ఆణిముత్యాలులో భాగంగా నగరంలోని అంబేద్కర్ కళావేదికలో జిల్లాస్థాయిలో పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు స్టేట్ బ్రిలియన్స్ అవార్డులను మంత్రి సీదిరి అప్పలరాజుతో కలిసి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని, ఆ దిశగానే విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చెప్పారు. పోటీ ప్రపంచంలో నిలదొక్కుకునేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని అమలు చేస్తోందని, సిబిఎస్ఇ సిలబస్‌నూ అందుబాటులోకి తెచ్చిందన్నారు. రాష్ట్ర పశుసంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్టేట్ బ్రిలియన్స్ అవార్డుల పేరిట రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానానికి రూ.లక్ష, జిల్లాస్థాయిలో రూ.50 వేలు, నియోజకవర్గ స్థాయిలో రూ.15 వేలు అందిస్తోందన్నారు. ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకూ ప్రోత్సాహక బహుమతులు అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.తిరుమల చైతన్య, జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి కె.ప్రకాశరావు, సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అపరిష్కృతంగా ఉపాధ్యాయుల సమస్యలు

పరిష్కరించాలని స్పీకర్‌కు ఫ్యాప్టో వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలు దీర్ఘకాలం పాటు పెండింగ్‌లో ఉన్నాయని, పరిష్కారానికి చొరవ చూపాలని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) విజ్ఞప్తి చేసింది. ఆమదాలవలసలోని క్యాంపు కార్యాలయంలో స్పీకర్‌ను శనివారం కలిసిన ఫ్యాప్టో నాయకులు వినతిపత్రం అందించారు. పెండింగ్ సమస్యలపై ప్రభుత్వానికి, అధికారులకు పదేపదే విన్నవించినా పరిష్కారం కాకపోగా, కొత్త సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉపాధ్యాయులపై అనుచితంగా వ్యవహరిస్తున్నారని స్పీకర్ దృష్టికి తీసుకువెళ్లారు. పాఠశాల విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేసే జిఒ నంబరు 117ను రద్దు చేసేలా చూడాలని కోరారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని, పిఆర్‌సి, ఇతర బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. చట్టబద్ధమైన 12వ పిఆర్‌సిని వెంటనే నియమించాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలను 11వ పిఆర్‌సికి అనుగుణంగా పెంచాలని కోరారు. స్పీకర్‌ను కలిసిన వారిలో ఫ్యాప్టో నాయకులు పి.అప్పారావు, ఎస్.కిశోర్ కుమార్, కె.డేనియల్, కామేశ్వరరావు తదితరులున్నారు.


స్పీకర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ప్రాధాన్యతా కేసులపై ప్రత్యేక శ్రద్ధ

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

గుర్తించిన ప్రాధాన్యతా కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, పోలీసు అధికారులతో శనివారం నిర్వహించిన నేర సమీక్షా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడంలో భాగంగా తప్పు చేసిన నిందితులకు శిక్ష పడేలా 520 కేసులను గుర్తించామన్నారు. కోర్టులో కేసుల విచారణ సమయంలో సాక్షులను క్రమపద్ధతిలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ల వద్ద ప్రవేశపెట్టాలని సూచించారు. నేరస్తులకు శిక్షలు పడేలా ప్రాసిక్యూటర్స్ కృషి చేయాలన్నారు. దర్యాప్తు అధికారులు ఛార్జిషీట్ దాఖలు చేయడంలో ప్రాసిక్యూటర్ల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. శిక్షల శాతం పెరిగితేనే నేరాలు తగ్గుముఖం పడతాయని చెప్పారు. రోడ్డు భద్రతా నియమాలు అతిక్రమించిన వారిపై జరిమానాలు విధించడంతో పాటు వాహన చోదకులు హెల్మెట్ ధరించే విధంగా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలు, వృద్ధుల మిస్సింగ్ కేసులకు సంబంధించి పలురకాల కోణాల్లో దర్యాప్తు చేయాలని సూచించారు. ఖైనీ, గుట్కా, మద్యం, గంజాయి రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ ప్రాపర్టీ, గ్రేవ్ కేసుల విచారణను వేగవంతం చేసి కేసులను పరిష్కరించాలని సూచించారు. నేరాల నివారణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. రౌడీ షీటర్లపై నిఘా పెట్టి, వారు ఎటువంటి నేరాలకు పాల్పడకుండా వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎఎస్‌పిలు టి.పి విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డైరెక్టర్ ఆఫ్ ఎం.మల్లేశ్వరావు, అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ కె.ఉషాకిరణ్, కోత తిరుమలరావు, వి.కృష్ణచంద్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, డిఎస్‌పిలు, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

21న అంతర్జాతీయ యోగా దినోత్సవం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈనెల 21వ తేదీన నిర్వహించనున్నట్లు ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ వెల్లడించారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం ఆరు నుంచి ఎనిమిది గంటల వరకు ఆయుష్ శాఖ ఆధ్వర్యాన యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నగరంలోని అన్ని పాఠశాలల విద్యార్థులు, వైద్యారోగ్యశాఖ, పారామెడికల్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు పాల్గొనున్నట్లు చెప్పారు. యోగా శిక్షణా కేంద్రాలు ఇందులో పాల్గొని యోగా వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరిస్తూ యోగాసనాలు వేయించనున్నారని చెప్పారు. ఈ ఏడాది వసుధైక కుటుంబం నినాదంతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆయుష్ సీనియర్ వైద్యాధికారి పి.జగదీష్, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి డిఆర్ఒ మురళీకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న జెసి నవీన్

ఆదర్శ గ్రామాలకు ప్రణాళికలు

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సంసద్ ఆదర్శ్ గ్రామ్ యోజన (ఎస్ఎజివై) పథకం ద్వారా ఆదర్శ గ్రామాల ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ పిలుపునిచ్చారు. ఎస్ఎజివై ద్వారా జిల్లాలో ఎంపికైన ఆదర్శ గ్రామాల్లో నిర్దిష్ట ప్రణాళికపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాస్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజల ఆర్థిక, సామాజిక అభివృద్ధి, సుపరిపాలన దిశగా ప్రణాళికలను తీర్చిదిద్ది, ఎంపిక చేసిన గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని సూచించారు. ముఖ్యంగా ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, పంచాయతీ కార్యదర్శులు కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. ఎంపీలతో ఎంపిక చేసిన నాలుగు గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్ది, అక్కడి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచాలని చెప్పారు. ఆదర్శ గ్రామాలుగా ఎంపికైన సోంపేట మండలం ఇసకలపాలెం, పలాస మండలం గురుదాసుపురం, కొత్తూరు మండలం కుద్దిగాం, శ్రీకాకుళం మండలం నైర, పొందూరు మండలం తండ్యాంలో ఇప్పటికే రూపొందించిన గ్రామాభివృద్ధి ప్రణాళికను సకాలంలో అమలు చేయాలన్నారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, సిపిఒ వి.ఎస్.ఎస్ లక్ష్మీప్రసన్న, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చౌదరి శృతికి డాక్టరేట్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శ్రీకాకుళం నగరానికి చెందిన చౌదరి శృతికి డాక్టరేట్ గౌరవం దక్కింది. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో వైస్ ఛాన్సలర్ పి.వి.జి.డి ప్రసాద్ డాక్టరేట్‌ను శనివారం ప్రదానం చేశారు. బయోటెక్నాలజీలో ఆక్టినోమైసిటీస్ ద్వారా యాంటీబయాటిక్ ప్రొటేజ్ తయారు చేయడంపై చేసిన పరిశోధనకు గానూ డాక్టరేట్‌ను అందించారు. కార్యక్రమంలో లెఫ్టినెంట్ డాక్టర్ నిక్కు మురళీ యుగంధర్, ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు, ఎపి జిఎస్‌టి అధికారి ఎంప్లాయీస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లిన రమేష్, చౌదరి రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.


డాక్టరేట్‌ను అందుకుంటున్న చౌదరి శృతి

లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం అమలవుతోందని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టులోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కోర్టులోని మహిళా ఉద్యోగులకు లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగి ఎవరైనా ధైర్యంగా తమ సమస్యలు చెప్పుకునే అవకాశం ఉందన్నారు. మహిళా ఉద్యోగులు లైంగిక వేధింపులకు గురైతే వారి పేరు వెల్లడించకుండా గోప్యత పాటిస్తామని తెలిపారు. సదస్సులో మొదటి అదనపు జిల్లా జడ్జి కె.శ్రీదేవి, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అనురాధ, లోక్‌అదాలత్ జడ్జి జ్ఞాన సువర్ణరాజు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

నేడు శిక్షణ, ఉపాధికి ఎంపికలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (సీడాప్), డిఆర్‌డిఎ సంయుక్తంగా పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్లుగా శిక్షణ, ఉపాధి పొందడానికి ఈనెల 18న ప్రాంగణ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎచ్చెర్ల టిటిడిసి కేంద్రంలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్‌గా శిక్షణ పొందేందుకు ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులైన పురుష, స్త్రీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన వారికి శిక్షణా కాలంలో ఉచిత భోజన వసతి సౌకర్యం, రెండు జతల యూనిఫారాలు, శిక్షణా మెటీరియల్, సర్టిఫికేట్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వంద రోజుల పాటు శిక్షణ ఉంటుందని అనంతరం ఉద్యోగ నియామకం చేపట్టనున్నట్లు తెలిపారు. నెలకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం చెల్లిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు ఆధార్, బయోడేటా తీసుకురావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్లకు 9985623025, 9182446325 సంప్రదించాలని సూచించారు.

కోడి ముందే కూసింది



ఎన్నికల రాజకీయ కోడి ఏడాది కిందటే కూసింది. ముందస్తు ఎన్నికల రూపంలో పట్టపగలే కోడి కూయడం చూస్తున్నాం. ఎన్నికల కోడ్‌కు, కోడి కూతకు ఎలాంటి సంబంధం లేకుండా పోయింది. ఈసారి జరుగనున్న ఎన్నికల ప్రచారంలో కొంత సానుకూల వాతావరణం నెలకొంది. ప్రధాన పార్టీలన్నీ గతంలో మాదిరి కాకుండా ప్రజల ముందుకు ముందస్తుగానే వెళ్లాలని నిర్ణయం తీసుకోవడం చూశాం. జిల్లాలో ఇప్పుడు అదే జరుగుతోంది. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం ఇచ్చిన సంక్షేమ పథకాలను గుర్తించేలా ప్రచారం చేయాలని వైసిపి నిర్ణయం చూశాం. సంక్షేమ పథకాలు ఆసరాగా నిలుస్తున్నా, మౌలిక సమస్యల పరిష్కారానికి అదే గీటురాయి కాదు. ప్రచార కార్యక్రమంలో ప్రభుత్వం అన్న పదాన్ని చేర్చడం ద్వారా ప్రభుత్వ యంత్రాంగాన్ని రంగంలో దించడం చూస్తున్నాం. ఇది ప్రశాంత్ కిశోర్ వ్యూహ రచనలో భాగమేనని స్పష్టమవుతోంది. ఈ ప్రచారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఒకేలా లేదు. మళ్లీ తమకే టిక్కెట్లు అన్న భరోసా పొందినా, అధికారికంగా ప్రకటించేంత వరకు జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలకు మనసు స్థిమితంగా ఉండడం లేదని తెలిసింది. అందుకు వారంతా టెక్కలి నియోజకవర్గాన్ని ఉదాహరణగా చూపిస్తున్నారు. అందుకే అభ్యర్థులనుకునే వారు స్థిమితంగా ఉండలేకపోతున్నారు. ఈ గ్రూపుల గోలలోనూ ఫిరాయింపుల ప్రక్రియకు పలువురు శ్రీకారం చుట్టేందుకు సన్నద్ధమవుతున్నారని తెలిసింది. ఇప్పటికే నరసన్నపేటలో ఫిరాయింపుల పర్వానికి ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ స్వాగతం పలుకుతూ టిడిపి వాళ్లను చేర్చుకుంటున్నారు. అయితే వెనుక ప్రజలు ఉన్నారా? లేదా? అన్నది తర్వాత అంశం. శ్రీకాకుళంలోనూ అలాంటి ఆలోచనలో నేతలు ఉన్నారని తెలిసింది. ఫలానా వారిని చేర్చుకోవద్దని కొందరు నేతలు మంత్రి ధర్మాన ప్రసాదరావుకు సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. అలాంటి సమస్యలేవీ రాకుండా అందుకోసం ఒక కమిటీని నియమించి, ఆ కమిటీ సూచనల మేరకు వచ్చిన వారికి కండువాలు కప్పాలని సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అసమ్మతి రాగాన్ని గట్టిగా వినిపిస్తున్న నియోజకవర్గాల్లో చివరి దశలో ఫిరాయింపులు ఉండవచ్చన్న అభిప్రాయం కొందరి నేతల్లో వినిపిస్తోంది.

శ్రీకాకుళం ఎంపీ టిక్కెట్ విషయంలో అధినేత ఇంకా దోబూచులాట ఆడుతున్నట్లు కనిపిస్తోంది. మంత్రి ధర్మాన ప్రసాదరావును ఎంపీగా పోటీ చేయాలని అధినేత సూచించారని పార్టీ వర్గాల్లో ప్రచారం మొదలైంది. ఈ ప్రచారం మంత్రి అత్యంత సన్నిహితుల నుంచి మాత్రం వినిపించడం లేదు. ఇలాంటి విషయాల్లో అధినేత ఏం చెప్పినా సన్నిహితులకు ధర్మాన చెప్పడం అలవాటు. ఈ విషయం ఆ నోటి నుంచి వారికి చేరలేదని తెలిసింది. విపక్షాలు ఏకమైనా ఏం చేయలేరన్న జగన్ నోటి మాటను జిల్లా నేతలు వల్లె వేస్తున్నారు. ఆ ప్రచారం వాస్తవాలకు దగ్గరగా ఉందనిపించినా రెండు, మూడు వేల ఓట్లతో గెలిచిన వారికి ఆ సమస్య ఎదురవుతుందని చెప్తున్నారు. జిల్లాలో అలాంటి పరిస్థితి లేదని చెప్తున్నారు. జిల్లాలో టిడిపితో జనసేనతో పాటు బిజెపి కలిసినా వైసిపిపై ఎలాంటి ప్రభావం ఉండదని చెప్తున్నారు. దేశవ్యాప్త రాజకీయ సమీకరణలు చూస్తుంటే జిల్లాలో టిడిపికి అదే మైనస్ అవుతుందని, అనుకోకుండా వైసిపికి ప్లస్ అవుతుందని సీనియర్ రాజకీయ పరిశీలకులు చెప్తున్నారు. టిడిపిలోని కొందరు సీనియర్ నేతల భయం చూస్తుంటే అదే నిజమేమోనని అనుకోవాలి. రాజకీయ రంగంలో పొత్తులకు వైసిపి దూరంగా ఉన్నా, చట్టసభల్లో మాత్రం కమలాన్ని అక్కున చేర్చుకునేలా వ్యవహరిస్తూ ప్రజలను మోసగిస్తుందన్న ప్రచారం వైసిపి నేతల్లో వినిపిస్తోంది.

జిల్లాలో వైసిపికి ప్రతికూల పరిస్థితులు కనిపిస్తున్నా, టిడిపికి సానుకూల వాతావరణం ప్రజల నోట వినిపించడం లేదు. వైసిపి వ్యతిరేక ఓటుతో టిడిపి పరుగులు తీస్తున్న సమయంలో బిజెపితో చెలిమి చేయడం పరుగు తీస్తున్న కాళ్లల్లో కర్ర పెట్టినట్లు అయిందని టిడిపి సీనియర్ నేత ఒకరు వ్యాఖ్యానించడం విశేషం. మళ్లీ అధికారంలోకి రావాలన్న కోరిక కంటే తన రాజకీయాలకు బిజెపి అడ్డం పడుతుందన్న భయంతోనే చంద్రబాబు కమలంతో చెలిమి చేస్తున్నారన్న అభిప్రాయంలో జిల్లాలో ఆ పార్టీ నేతలు కొందరున్నారు. తెలంగాణలో బిఆర్‌ఎస్ నేతలపై ఐటి దాడులను వారు గుర్తు చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో బిజెపితో దూరం కావడంతో ఆర్థిక వనరుల దిగ్బంధం జరిగిందని ప్రచారం ఉంది. ఈ చెలిమితో అలాంటివేమీ ఉండవని జిల్లా నేతలు కొందరు చెప్తున్నారు. జిల్లాలో మాత్రం బిజెపితో తాము లాభపడేదేమీ ఉండదని, ఏమైనా ఉంటే రాజకీయంగా నష్టమే ఉంటుందని చెప్తున్నారు. జిల్లాలో టిడిపి రాజకీయాలు అంత సజావుగా లేవు. ఆ పార్టీలోనూ గ్రూపుల గోల బలంగా ఉంది. శ్రీకాకుళంలో మొలకెత్తి మొక్క అయింది. పాతపట్నంలో వృక్షమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. ఎచ్చెర్లలో అలజడి సృష్టిస్తోంది. ఈ గ్రూపుల అలజడి వెనుక పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఉన్నారన్న ప్రచారం ఆ పార్టీలోనే ఉంది. జిల్లాలో జనసేన జాడ కనిపించడం లేదు. గెలుపోటములపై ఎలాంటి ప్రభావం చూపించలేని పరిస్థితి ఇప్పటికే ఉంది. పొత్తులో పలాస సీటును జనసేనకు కేటాయిస్తారన్న ప్రచారం టిడిపి వర్గాల నుంచి వినిపిస్తోంది. బిజెపి మిత్రపక్షంగా జత కలిస్తే, జిల్లాలో ఒక స్థానం అడిగే అవకాశం ఉంటుందని టిడిపి వర్గాలు చెప్తున్నాయి.

ఒకనాటి జాతీయ పార్టీగా వెలుగొందిన కాంగ్రెస్ పార్టీ జవసత్వాలు పొందేందుకు కసరత్తు ప్రారంభించినట్లు తెలిసింది. ఈ నెలాఖరులోగా జిల్లా కమిటీని పునర్వ్యవస్థీకరణ చేయనుంది. మార్పులు చేర్పులు ఎవరూ ఊహించని విధంగా ఉంటాయని తెలిసింది. రాజ్యాంగ పరిరక్షణ కోసం మతతత్వానికి వ్యతిరేకంగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం వామపక్షాలు ప్రజా పోరాటాలను ప్రథమ కర్తవ్యంగా భావించి జిల్లాలో ముందుకు పోతున్నాయి. సమయం వచ్చినప్పుడు ఎన్నికల గురించి ఆలోచించే పనిలో ఉన్నాయి. ప్రధాన పార్టీలన్నీ ముందే ఎన్నికలకు కోడి కూత కూయడంతో జిల్లాలోనూ రాజకీయ వాతావరణం మార్పులు చోటుచేసుకుంటుంది. నేతల్లో ఎన్నికల వేడి తాకింది తప్ప ప్రజల దరిదాపుల్లోకి ఇంకా రాలేదు. వారికి కోడి కూత వినిపించని దూరంలో ఉంది.

- సత్తారు.భాస్కరరావు


సూరిబాబును సన్మానిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

బిసిలకు టిడిపి అండ

ఎంపీ రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బిసి, ఎస్‌సి, ఎస్‌టిల అభ్యున్నతికి ఎల్లప్పుడూ కృషి చేస్తోందని, అధికారంలో లేకున్నా పార్టీ పదవుల్లో ఎక్కువ శాతం మందికి చోటు కల్పించి సముచిత స్థానం కల్పించిందని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. జంఘం రాష్ట్ర సాధికార కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన విభూది సూరిబాబును ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టించి పని చేసే ప్రతి ఒక్కరికీ పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. ప్రజలకు తనవంతు సేవ చేయడం ద్వారా ప్రజాభిమానాన్ని పొందడానికి చక్కటి అవకాశమని గుర్తు చేశారు. కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, గద్దె సుభాష్ చౌదరి, కత్తిరి కమల, సకలాబత్తుల శ్రీనివాసరావు, లోకనాథం నాగరాజు, మలకపల్లి శివకుమార్, బి.కుమార్, బూరగాపు మోహనరావు, రవికుమార్, రమణ, బాబూరావు పాల్గొన్నారు. అలాగే నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జలుమూరు మండలం లింగన్నాయుడుపేటకు చెందిన గొండు రంగారావును పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జనార్ధనరావు

జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరి శాస్త్రీయ సమాజాన్ని నిర్మిద్దామని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు అన్నారు. పట్టణంలోని స్థానిక లక్ష్మీనగర్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులను, విద్యార్థులను సభ్యులుగా శనివారం చేర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనం చేసే శాస్త్రీయ ఆలోచనా క్రమాన్ని ఆటంకపరిచే, అడ్డుకునే శక్తులు సామాజిక వ్యవస్థలో ఉన్నాయని అన్నారు. అలాగే అనేక రంగాల్లో మునుపెన్నడూ ఊహించని ఆవిష్కరణలతో శాస్త్ర విజ్ఞానం దూసుకుపోతుందని అన్నారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరచడానికి జన విజ్ఞాన వేదిక జాగృతం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు హెచ్.వి.సత్యనారాయణ, బెండి సూర్యనారాయణ, నారాయణరావు, గోవిందరావు, మెండ శ్యామలరావు, కూర్మాన షణ్ముఖరావు, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు చింతాడ వెంకటరమణ, జి.సుదర్శనరావు, కె.లత, డి.భారతి, బి.సూర్యనారాయణ, కె.అప్పలనాయుడు, వి.గోపి, బి.శ్యాంసుందర్రావు, పి.కృష్ణ, పి.పాపినాయుడు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి- పొందూరు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తండ్యాం పంచాయతీ పరిధిలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో 98 శాతం నెరవేర్చామని అన్నారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, ఎంపిటిసి ప్రతినిధి వడగ మోహనరావు, కృష్ణ, రమణ పాల్గొన్నారు.


పొందూరు : పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మొగిలిపాడులో శనివారం గడపగడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మంత్రి ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా? లేదా? ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ మొగిలిపాడు నుంచి దత్తాత్రేయ ఆశ్రమం వరకు రోడ్డు అధ్వానంగా ఉన్నా గత ప్రభుత్వం, గత పాలకులు పట్టించుకోలేదన్నారు. మున్సిపాలిటీలో వైసిపి పాలకవర్గం అధికారం చేపట్టి తక్కువ సమయంలో రూ.70 లక్షల వ్యయంతో మొగిలిపాడు నుంచి


పలాస : పథకాలను వివరిస్తున్న మంత్రి అప్పలరాజు

దత్తాత్రేయ ఆశ్రమం వరకు రోడ్డు నిర్మించామని తెలిపారు. త్వరలో మున్సిపాలిటీలో ఇంటింటికీ తాగునీరు అందిస్తామని అన్నారు. మున్సిపాలిటీ విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, పలాస ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవానీశంకర్, కౌన్సిలర్ నిర్మల, సవర సోమేశ్వరరావు, సనపల సింహాచలం, కో-ఆప్షన్ సభ్యులు రోణంకి శ్రీనివాసరావు, బమ్మిడి సంతోష్, మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

పోలీస్ శాఖలో ఉత్తమ సేవలు అందించిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని ఎస్‌పి జి.ఆర్.రాధిక అన్నారు. 2022 రాష్ట్ర అవతరణ దినోత్సవం, 2023 ఉగాదికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమసేవా పతకం, సేవా పతకాలకు డిఎస్‌పి వాసుదేవ్, సిఐ డి.వి.వి.సతీష్ కుమార్, ఎస్ఐ ఆర్.శంకరరావు, అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.శేఖరరావు, ఎఆర్ ఎస్ఐ ఎం.చిన్నారావు, ఆర్మ్డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ వై.నర్సింహులు, టి.రాంబాబు, కానిస్టేబుల్ ఎ.మల్లేశ్వరావు, బి.అప్పలనాయుడులు ఎంపికయ్యారు. వీరికి ఎస్‌పి కార్యాలయంలో సతీష్‌కుమార్, అప్పలనాయుడులకు తప్ప మిగతా వారందరికీ పోలీస్ సేవ, ఉత్తమ సేవ పతకాలు, నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలను శనివారం అందజేశారు. అలాగే దిశ యాప్ డైన్‌లోడ్, రోడ్డు ప్రమాదాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారికి తనిఖీ చేసి జరిమానా విధించిన సిఐ, ఎస్ఐలకు ప్రశంసాపత్రాలను అందజేశారు.


జ్ఞాపికను అందజేస్తున్న ఎస్‌పి రాధిక

మహిళ పోలీసులకు జ్ఞాపికాలను ప్రదానం

జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు విధి నిర్వహణలో దిశ యాప్ డౌన్‌లోడ్, అసాంఘిక కార్యకలాపాలపై ముందుసు సమాచారం, గ్రామస్థాయిలో మహిళలకు అవగాహన, చైతన్యాన్ని తీసుకొవచ్చి, వివిధ అంశాలపై గుడ్‌వర్క్ చేసిన 23 మందికి ప్రత్యేక జ్ఞాపికలను అందజేశారు.

బిఆర్‌ఎయు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రాజశేఖర్

ప్రజాశక్తి- పొందూరు


రాజశేఖర్

ఎచ్చెర్లలోని అంబేద్కర్ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా చింతాడ రాజశేఖర్‌ను నియమిస్తూ ఉన్నత విద్యాశాఖ అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పొందూరు మండలంలోని గోకర్ణపల్లికి చెందిన ఎం.టెక్, పిహెచ్‌డి చేశారు. ప్రస్తుతం టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో సిఎస్‌సి విభాగాధిపతిగా ఉన్న ఈయనను కాంట్రాక్టు ప్రాతిపదికన యూనివర్సిటీలో ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు అందాయని సోమవారం విధుల్లో చేరుతున్నట్లు రాజశేఖర్ తెలిపారు.

తగిన జాగ్రత్తలతోనే ప్రాణ రక్షణ

వజ్రపుకొత్తూరు : సముద్రంలో వేట చేసే మత్స్యకారులు అత్యవసర పరిస్థితుల్లో తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా తమ ప్రాణాలు రక్షించుకోవడంతో పాటు ఇతరుల ప్రాణాలు కాపడవచ్చని శిక్షణ డైరెక్టర్ భరత్ అన్నారు. మండలంలోని దేవునల్తడ సముద్రం ఒడ్డున మత్స్యశాఖ ఆధ్వర్యాన జిల్లాలోని మత్స్యకారులకు బీచ్ లైఫ్ గార్డ్ అంశంపై నైపుణ్య అభివృద్ధి అధికారులు ఇస్తున్న శిక్షణను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోమవారం నుంచి శనివారం వరకు దేవునల్తాడ రైతు భరోసా కేంద్రం ప్రాంగణంలో 25 మంది మత్స్యకారులకు పిఎంఎంఎస్‌వై పథకం కింద నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు ఆర్థిక ప్రోత్సాహంతో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణలో పాల్గొన్న వారికి ఆస్ట్రేలియన్ లైఫ్ సేవింగ్ అకాడమీ ధ్రువపత్రాలను అందజేస్తామని పేర్కొన్నారు. ఈ ఆరు రోజులు శిక్షణలో పాల్గొన్నవారికి ఒక్కొక్కరికీ రూ.3 వేలు చొప్పున వారు బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ ట్రైనర్‌బాలు, కొండలరావు, సర్పంచ్ వరదరాజులు, ఎంపిటిసి వెంకన్న, సాగరమిత్రలు, మత్స్యకార సంఘాల నాయకులు పాల్గొన్నారు.


శిక్షణను పరిశీలిస్తున్న భరత్


మాట్లాడుతున్న జడ్జి మణి

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యా హక్కు చట్టం, బాల కార్మికుల చట్టం, బాల్య వివాహాల చట్టాల గురించి అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జాతీయ సేవా ప్రోగ్రాం ఆఫీసర్ జలుమూరు రవిబాబు అధ్యక్షతన శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ యువత సక్రమమైన మార్గంలో నడిచి అందరికీ ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకొని విద్యారంగంపై ఆసక్తి కలిగి భవిష్యత్‌ను చక్కదిద్దుకొని సక్రమమైన మార్గంలో పయనించాలన్నారు. ఏదైనా సమస్య వచ్చినపుడు ఆవేశానికి లోను కాకుండా ఆలోచించడం వల్ల నేరాల రేటు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ సీపాన గోవిందరావు, న్యాయవాదులు తమ్మినేని అన్నంనాయుడు, సనపల ప్రసాదరావు, ప్రిన్సిపాల్ బి.శ్యామ్‌సుందరరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.


విత్తనాలను అందిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

రైతు శ్రేయస్సే లక్ష్యం

ఎమ్మెల్సీ రామారావు

కవిటి: రైతు శ్రేయస్సే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పనిచేస్తున్నట్లు ఎమ్మెల్సీ నర్తు రామారావు తెలిపారు. మండలంలోని సిలగాం రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం రైతులకు వరి విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సకాలంలో రైతులకు విత్తనాలు అందించడమే కాకుండా రైతులకు అవసరమైన ఎరువులూ ఆర్‌బికె ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ మాట్లాడుతూ ఆర్‌జిఎల్ - 2537 రకం 289.8 క్వింటాళ్లు, ఎంటియు-1061 రకం 44.1 క్వింటాళ్లు, ఎంటియు - 1064 రకం 73.8 క్వింటాళ్లు, బిపిటి-5204 రకం 8.25 క్వింటాళ్లు, ఎంటియు - 7029 రకం 6.3 క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణారెడ్డి, సర్పంచ్ ప్రతినిధి కడియాల బాబూరావు, విఎఎలు కళ్యాణ్, పవన్, అన్వేష్ పాల్గొన్నారు.

ఎన్‌జిఒ నేతల కృతజ్ఞతలు


ధర్మానను సన్మానిస్తున్న ఎన్‌జిఒ నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో సానుకూల దృక్పథం కనబరచడం ఆనందంగా ఉందని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాంలు పేర్కొన్నారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావును శనివారం కలిసి దుశ్శాలువ కప్పి సన్మానించారు. క్యాబినెట్ సమావేశంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తీసుకున్న నిర్ణయాలపై కృతజ్ఞతలు తెలిపారు. పాత పిఆర్‌సి తరహాలో కాకుండా కొత్తగా కమిటీ వేయడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, వైద్య ఉద్యోగులకు 010 కింద జీతాల చెల్లింపు తదితర నిర్ణయాలపై ఉద్యోగులకు మేలు చేకూరుతుందన్నారు. ప్రభుత్వానికి తాము ఎల్లప్పుడు సహకరించేందుకు విధేయత ప్రకటించారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తూ... సానుకూల నిర్ణయాలు వచ్చేలా కృషి చేసిన ధర్మానకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు, అసోసియేషన్ పూర్వ కార్యదర్శి ఆర్.వి.ఎస్.శర్మ, జిల్లా సహాధ్యక్షులు కంఠ జయరావు, జిల్లా నాయకులు బడగల పూర్ణ చంద్రరావు, బడియా కామరాజు, మెట్ట భూపాలరావు, రాంబాబు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

జీడికి రూ.16 వేలు మద్దతు ధర ఇవ్వాలి

ప్రజాశక్తి- కవిటి

ఇటీవల పలాసలో సమావేశమైన జీడి వ్యాపారులు 80 కేజీల జీడిపిక్కలు బస్తా రూ.8 వేలుకు కొనుగోలు చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని, ప్రస్తుతం రైతుల పరిస్థితి ఏ విధంగా ఉందో ఈ ఒక్క సంఘటనే ఉదాహరణ అని కవిటి రైతు సంఘం (ఎఫ్‌పిఒ) అధ్యక్షుడు బల్లెడ జయప్రకాష్ అన్నారు. జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ స్థానిక ఎఫ్‌పిఒ ఆధ్వర్యాన రైతులతో కలిసి తహశీల్దార్ శేఖర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ దేశంలో ఏ వ్యక్తి కానీ, సంస్థ కానీ తాము ఉత్పత్తి చేసే వస్తువుకు తామే ధర నిర్ణయిస్తారని, కానీ, ఒక్క రైతు విషయం వచ్చేసరికి అటు దళారులు, ఇటు వ్యాపారులు ఏకమై రైతాంగ వ్యవస్థనే నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత వ్యవస్థలో రైతులు, వ్యవసాయం అంటేనే చులకనగా మారిపోయిందని వీరు ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లో కేజీ జీడి పప్పును వివిధ రకాలుగా గ్రేడింగ్ చేసి రూ.600 నుంచి రూ.1000 వరకు అమ్ముతున్న వ్యాపారులు, జీడి పిక్కలు బస్తాకు రూ.8 వేలు మాత్రమే చెల్లిస్తామని చెప్పడం ఎంతవరకు న్యాయమని రైతులు ప్రశ్నించారు. ఇప్పటికే చాలా మంది రైతులు అప్పులు చేసి జీడి తోటలు కౌలుకు చేశారని, వ్యాపారులు చెప్పిన ధరతో వారి పరిస్థితి ఏంటని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో జీడి రైతుల పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించి 80 కేజీల జీడి పిక్కల బస్తాకు రూ.16వేలు మద్దతు ధర ప్రకటించాలని రైతులు కోరారు. కార్యక్రమంలో రైతులు బల్లెడ జయప్రకాష్, బొర్ర కీర్తిరావు, దున్న రంగారావు, పి.శంకరరావు, పండి సీతారాం, ఎల్.ప్రసాదరావు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న టిఎన్‌టియుసి నాయకులు

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలి

కోటబొమ్మాళి: రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోలందరినీ క్రమబద్ధీకరణ (రెగ్యులర్) చేయాలని ట్రేడు యునియన్ కౌన్సిల్ (టిఎన్‌టియుసి) టెక్కలి నియోజకవర్గ అధ్యక్షుడు జి.నరసింగరావు కోరారు. ఈ మేరకు టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఉద్యోగికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో 2014 జూన్ 2 నాటికి ఐదేళ్ళ సర్వీసు పూర్తి చేస్తున్న 10,117 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు మాత్రమే క్రమబద్ధీకరణ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారని అన్నారు. దీంతో చాలా మంది నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి ధరాపు రాము, జిల్లా కార్యదర్శి ధర్మారావు, రాజాపు, శిమ్మ శ్రీను, అప్పారావు పాల్గొన్నారు.

రేపట్నుంచి డిగ్రీ అడ్మిషన్ల రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


సురేఖ, ప్రిన్సిపాల్

2023-24 విద్యా సంవత్సరానికి సింగిల్ మేజర్ హానర్స్, డిగ్రీ అడ్మిషన్లకు ఈ నెల 19 నుంచి 24వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ తెలిపారు. కళాశాల ఆవరణలో శనివారం విలేకరులతో మాట్లాడారు. 19న సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో కొత్త విద్యా విధానంతో పాటు రిజిస్ట్రేషన్ చేసుకునే విధానం గురించి గురించి అవగాహనా సదస్సు నిర్వహిస్తామని అన్నారు. మేజర్, మైనర్ సబ్జెక్టుల ఎంపిక చేసుకునేందుకు విద్యార్థులకు ఈ సదస్సు ద్వారా పూర్తి అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. అడ్మిషన్ పొందగోరు విద్యార్థులు బదిలీ, స్టడీ, కాస్ట్, ఇన్‌కం ధ్రువపత్రాలు, పది, ఇంటర్ మార్క్స్ లిస్ట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరుకావాలని సూచించారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులకు కళాశాలలోనే ఉచి తంగా రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందుబాటు లో ఉండే సింగిల్, మేజర్ కోర్సుల్లో మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, బోటని, జువాలజీ, బయో టెక్నాలజీ, బికాం జనరల్, బికాం సిఎ, బిబిఎ సెల్ఫ్ ఫైనాన్స్, బిఎ హిస్టరీ, ఎకనామిక్స్, స్పెల్ తెలుగు, స్పెషల్ ఇంగ్లీష్ ఉంటాయని తెలిపారు. అవగాహనా సదస్సు, రిజిస్ట్రేషన్ కోసం 9705 722300, 9701177067, 9848125385, 9176141561 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు. ఈమెతో పాటు అడ్మిషన్ కో-ఆర్డినేటర్ బి.మోహనరావు ఉన్నారు.

పకడ్బందీగా 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి- జలుమూరు

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండలంలో పకడ్బందీగా నిర్వహించాలని ఎంపిపి వాన గోపి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండలంలో పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఇప్పటివరకు 90 శాతం మంది అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందాయని, మిగిలిన 10 శాతం మందికి వివిధ సాంకేతిక కారణాల ద్వారా అందలేదని, వారికీ సంక్షేమ పథకాలు అందజేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. ఈ నెల 23 నుంచి జూలై 22 వరకు రెండు టీములుగా అధికారులు సచివాలయాలను సందర్శించి వివిధ సాంకేతిక కారణాల ద్వారా సంక్షేమ పథకాలు అందిన వారిని గుర్తించి వారికి అక్కడికక్కడే


జలుమూరు : మాట్లాడుతున్న ఎంపిపి గోపి

పరిష్కరిస్తారని అన్నారు. మంజూరు చేసి వారు ఏ సంక్షేమ పథకానికి అర్హులు గుర్తించి ఆ సంక్షేమ పథకానికి దరఖాస్తు చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ ఐ.వి.అప్పారావు, ఇఒపిఆర్‌డి ఉమామహేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మెళియాపుట్టి : జగనన్న సురక్షిత కార్యక్రమం విజయవంతంపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్పెషలాఫీసర్ భవానీశంకర్ నిర్వహించారు. ఎంపిడిఒ, తహశీల్దార్ రెండు బృందాలుగా గ్రామాల్లో పర్యటించి జనగన్న సురక్షిత కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలోఎంపిడిఒ పి.చంద్రకుమారి, డిటి శంకరరావు, హౌసింగ్ ఎఇ శ్రీనివాసరావు, ఆర్ఐ వైకుంఠరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

మెప్మా పీడీ కిరణ్‌కుమార్


మాట్లాడుతున్న కిరణ్‌కుమార్


ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ పరిధిలోని సమాఖ్య సభ్యులు భాగస్వాములు కావాలని మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని రైతుబజారు వద్ద గల సమాఖ్య కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా పట్టణ పేదల కోసం ప్రభుత్వం ఇళ్ల నిర్మానానికి పెద్దపీట వేసిందని, అందులో భాగంగా పాత్రునివలస, రాగోలు, వాకలవలస, తోటపాలెం తదితర ప్రాంతాల్లో కాలనీల నిర్మాణం చురుగ్గా సాగుతోందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న చేయూత, ఆహార క్యాంటీన్ల నిర్వహణలో భాగస్వాములు కావాలన్నారు. వాటి విధి విధానాలను సభ్యులకు, ఆర్‌పిలకు, సిఒలకు వివరించారు. సమావేశంలో సిఎంఎం శారదావాణి, ఐ.బి.రాము, బి.ఎల్.వెంకటరావు, ఎల్.హెచ్.భాస్కర్, పట్టణ సమాఖ్య అధ్యక్షులు సుగాణారెడ్డి, సిఒలు రవికుమార్, సాయి, నాగమణి, అరుణ జయమణి, జ్యోతి, వినోద్ పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మహిళా సంఘాల సభ్యులు చిరు ధాన్యాలు, పెరటి తోటలు పెంపకంపై అవగాహన అవసరమని వెలుగు ఎపిఎం ఎం.ప్రసాదరావు అన్నారు. మండలంలోని హరిపురంలో గ్రామ సంఘాలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వయంశక్తి సంఘాలు ముఖ్యంగా జీవనోపాధులు కార్యక్రమంలో ప్రతి సభ్యులూ చిరుధాన్యాల పెంపకం, పెరటి తోటలు పెంపకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మునగ, బొప్పాయి నర్సరీలు, చేయూత మహిళా మార్టు ఏర్పాటులో సంఘాలు రుణాలు పొందడం, వాటిని తిరిగి చెల్లింపు, గ్రేడింగ్‌లో హరిపురం 31 సంఘాలూ ఎ-గ్రేడ్‌లో ఉండడం అభినందనీమన్నారు. కార్యక్రమంలో విఒఎ సుందరి, సిసి మోహనరావు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎపిఎం ప్రసాదరావు



పరిశీలిస్తున్న ఆర్‌ఐఒ దుర్గారావు

జ్ఞానజ్యోతి కళాశాల పరిశీలన

నరసన్నపేట: పట్టణంలోని జ్ఞానజ్యోతి కళాశాలను ఆర్‌ఐఒ ప్రగడ దుర్గారావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాలు మేరక మౌలిక సదుపాయాలు ఉన్నాయా? లేవా? అనే అంశంపై నిశితంగా పరిశీలించారు. తరగతులు, ల్యాబ్ పరికరాలు, అలాగే విద్యాబోధన తదితర అంశాలను పరిశీలించారు. అన్నీ వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ బాగున్నాయని తెలపడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. తమ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు బిఎస్‌పి సమావేశం

నందిగాం : ఆదివారం ఉదయం పది గంటలకు కంచిలి అంబేద్కర్ భవనంలో బిఎస్‌పి ఇచ్ఛాపురం నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బి.నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, బిసి, ఎస్‌సి, ఎస్‌టి దళిత బహుజన పేదలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రక్తదాన శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- పలాస

ప్రాణాపాయ స్థితిలో రక్తం అందక ఎంతోమంది మృత్యువాత పడుతున్నారని, సకాలంలో రక్తదానం చేయడం ద్వారా ఎంతో మంది ప్రాణాలు కాపాడవచ్చునని, అందుకు యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి, జిల్లా అదనపు వైద్య అధికారి అనురాధ అన్నారు. పలాస ప్రభుత్వాస్పత్రిలో ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా రెవెన్యూ శాఖ ఆధ్వర్యాన శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు రక్త నిల్వలు పెంచాల్సిన అవసరం ఉందన్నారు. మానవతా దృక్పథంతో ప్రతిఒక్కరూ రక్తదానం చేసి అందరిలో స్ఫూర్తిని నింపాలని సూచించారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. అనంతరం పలాస డివిజన్ పరిధిలో సుమారు 85 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో మందస, వజ్రపుకొత్తూరు మండలాల తహశీల్దార్లు బి.పాపారావు, అప్పలస్వామి, పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీర్ భవానీశంకర్, మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్, ఎంపిడిఒలు ఈశ్వరమ్మ, తిరుమలరావు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ ప్రాజెక్టు మేనేజర్ ఉమామహేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సీతారామ్మూర్తి


వికలాంగులతో మాట్లాడుతున్న సత్తిరాజు

వికలాంగులపై ప్రత్యేక శ్రద్ధ

పొందూరు: అంగవైకల్యం చిన్నారుల విద్యకు శాపం కాకూడదన్నదే ప్రభుత్వాల లక్ష్యమని తోలాపి పాఠశాల హెచ్‌ఎం ఎం.సత్తిరాజు, ఇఒపిఆర్‌డి కో-ఆర్డినేటర్ దినేష్ అన్నారు. తోలాపి క్లస్టర్ పరిధిలో వికలాంగుల విద్యార్థులను గుర్తించి శనివారం పాఠశాలలో చేర్పించారు. అంగవైకల్యం గల చిన్నారులలో మానసిక స్థైర్యాన్ని పెంచేందుకు భవిత కేంద్రాలను ఏర్పాటు చేశారని అన్నారు. ప్రతి ఉన్నత పాఠశాలలో స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులను నియమించామని అన్నారు. కార్యక్రమంలో తోలాపి స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ వేణుగోపాల్, రాధారాణి పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

మెళియాపుట్టి : మండలంలోని గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. స్థానిక ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అస్సాం రాష్ట్రం ఉదయగిరి జిల్లా దలకటి గ్రామానికి చెందిన సంజిత్ చత్రి (40) నాలుగు రోజుల క్రితం మండలంలోని దీనబంధుపురానికి సమీపంలో ఉన్న శ్యామ్ గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేయడానికి ఏడుగురు వ్యక్తులతో కలిసి వచ్చాడు. పనిచేసే క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో తలనొప్పి వస్తుందని తోటి కూలీలతో చెప్పాడు. రూమ్‌కి వెళ్లి విశ్రాంతి తీసుకోవాలని వారు పంపించేసి, యథావిధిగా పనులు చేసుకున్నారు. వారు పనులు ముగించుకొని రూమ్‌కి వచ్చే సమయంలో మృతుడు కనిపించకపోవడంతో వెతికారు. శనివారం మధ్యాహ్నం ఫ్యాక్టరీకి 300 మీటర్ల దూరంలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ మృతదేహాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే క్లూస్ టీమ్ కూడా పరిశీలించింది.

ప్రతిభను ప్రోత్సహించేందుకే 'జగనన్న ఆణిముత్యాలు'


జలుమూరు : అవార్డు పొందిన విద్యార్థులతో ఎంపిపి గోపి

ప్రజాశక్తి- జలుమూరు

విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం 'జగనన్న ఆణి ముత్యాలు' కార్యక్రమం చేపట్టిందని ఎంపిపి వాన గోపి అన్నారు. మండలంలోని శ్రీముఖలింగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జగనన్న ఆణి ముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ప్రధానోపాధ్యాయులను సన్మానించారు. శ్రీముఖలింగం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పంచాది ఈశ్వరరావు స్పాన్సర్ చేసిన ప్రథమ, ద్వితీయ, ద్వితీయ బహుమతులను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపిటిసి కె.హరిప్రసాద్, ఎంఇఒ బమ్మిడి మాధవరావు, వైసిపి నాయకులు బసవ వెంకటరమణ, న్యాయవాది చింతాడ వెంకటరావు, ప్రధానోపాధ్యాయులు టి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

కవిటి: కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన గుడియా హేమలత, పిల్లి భార్గవి, వజ్జ స్వాప్నికకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలను సర్పంచ్ పూడి లక్ష్మణరావు అందజేశారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఉప సర్పంచ్ ప్రతినిధి డి.దుర్యోధన, విద్యా కమిటీ అధ్యక్షుడు ఎం.కృష్ణారావు, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు బెందాలం మల్లేశ్వరరావు పాల్గొన్నారు.


కవిటి : ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

ఇచ్ఛాపురం : పదో తరగతిలో ప్రతిభ సాధించిన మున్సిపల్ పురుషోత్తపురం హైస్కూల్‌లో కె.విద్యారెడ్డి, జి.లక్ష్మి, ఆసి దీప, ఎపి మోడల్ స్కూల్‌లో కిరణ్‌సాహు, అందాల కీర్తి, కె.నికిత, సిహెచ్.అసిన్‌లకు నగదు, అవార్డులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వై.లత, ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి.శివప్రసాద్, వార్డు కౌన్సిలర్ ప్రతినిధి చాట్ల తిరుపతి, పేరెంట్ కమిటీ చైర్మన్ ధర్మారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారులకు మరో అవకాశం

ప్రజాశక్తి- బూర్జ


జగనన్న గృహ లబ్ధిదారులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పిస్తుందని గృహ నిర్మాణశాఖ ఎఇ రమణమూర్తి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందజేసేందుకు ముందుకొచ్చిందన్నారు. ఇంతవరకు ఎటువంటి నిర్మాణం చేపట్టకుండా ఖాళీ స్థలాలు ఉన్నా లబ్ధిదారులకు అదనంగా రూ.20 వేలు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారులకు అవగాహన కల్పించి గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ఈ అవకాశం వచ్చే ఆదివారం రాత్రి 12 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయనతోపాటు వర్క్ ఇన్‌స్పెక్టర్ రాంప్రసాద్ ఉన్నారు.


మాట్లాడుతున్న రవి

కార్పొరేట్ స్కూళ్లలో దోపిడీని అరికట్టాలి

ప్రజాశక్తి- పలాస

ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజు దోపిడీని అరికట్టాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రవి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కాశీబుగ్గ బిసి హాస్టల్‌లో ఎఐఎస్ఎఫ్ ముఖ్య నేతల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రయివేట్ విద్యా సంస్థలు ఇష్టరాజ్యంగా ఫీజు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. దీనికి తోడు నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి విద్యా సంస్థల దోపిడీలను నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు తిరుపతి, వెంకీ, నాయుడు, గణేష్, రాము పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న అప్పలనాయుడు

అప్పలనాయుడు పరామర్శ

లావేరు : మండలంలోని గోవిందపురం పంచాయతీ ఇజ్జడాపాలెంకు చెందిన పతివాడ భాస్కరరావు ఎచ్చెర్ల నియోజకవర్గం వైసిపి సీనియర్ నాయకులు లుకలాపు అప్పలనాయుడు పరామర్శించారు ఇటీవల భాస్కరరావు ఇటీవల శాస్త్రచికిత్స నిర్వహించుకున్నారు. విషయం తెలుసుకున్న అప్పలనాయుడు శ్రీకాకుళంలోని ఆస్పత్రికి వెళ్లి శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని ఆడిగితెలుసుకున్నారు అనంతరం పెద్దకొత్తకోటకు చెందిన మాజీ ఉప సర్పంచ్ వంగముడి సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యులనూ పరామర్శించారు. ఈయన వెంట మాజీ సర్పంచ్‌లు గొర్లె రామినాయుడు, శివంగం నాగరాజు, ఇ.శ్రీనివాసరావు, పతివాడ గురునాయుడు ఉన్నారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్టు

పొందూరు: మండలంలోని లోలుగులో ఉపహార్ ప్రాజెక్టు పరిధిలోని పిల్లలకు మల్టిపుల్ ఇంటెలిజెన్స్ టాలెంట్ టెస్టును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, నైపుణ్య పరీక్షలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ఏరియా మేనేజర్ బి.ఎం.పాల్, కో-ఆర్డినేటర్ ఏసుదాసు, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ లోపింటి అప్పారావు, సిబ్బంది ఉగాది, శ్రీను, స్వాతి, మాలతి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

సంక్షేమమే ధ్యేయం

పలాస : వైసిపి ప్రభుత్వ హయాంలో పుట్టిన పసిపాప నుంచి పండు ముసలి వరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అందిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని మెప్మా కార్యాలయంలో సిబ్బందితో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో చంద్రబాబు డాక్వా మహిళలకు పలు హామీలు ఇచ్చి మోసం చేశారని, ముఖ్యమంత్రి జగన్ అధికారం చేపట్టిన తరువాత రుణమాఫీ చేశారని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే మూడు విడతలుగా రుణాలను చెల్లించారని అన్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే తనకు నేరుగా తెలియజేస్తే సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో మెప్మా అధికారులు, సిబ్బంది, కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతు, రోణంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

బాధ్యతగా పనిచేయాలి

టెక్కలి రూరల్ : టెక్కలి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో నూతనంగా నియమితులైన అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు వైసిపి కార్యాలయంలో అంగన్వాడీలకు నియామక పత్రాలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఐసిడిఎ ప్రాజెక్టు అధికారి శోభారాణి, టెక్కలి, సంతబొమ్మాళి మండలాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

ఇచ్ఛాపురం : జన భాగదారిలో భాగంగా మండలంలో మండపల్లి పంచాయతీలో ఉన్న భవానీపురం అంగన్వాడీ కేంద్రంలో శనివారం రంగవల్లి పోటీలు నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యాన అంగన్వాడీ కార్యకర్త నరసమ్మ పర్యవేక్షణలో పిల్ల తల్లులకు ఈ పోటీలు నిర్వహించారు. అంగన్వాడీ ప్రీ స్కూల్‌లో పిల్లలకు ఆటాపాట, కథలతో బోధన చేస్తున్నామని అన్నారు.


ముగ్గులు వేస్తున్న మహిళలు

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలం లేని నిరుపేదలకు స్థలాలు మంజూరు చేసిన జగనన్న కాలనీలకు నీరు, విద్యుత్, రోడ్లు, డ్రెయినేజీలతో పాటు అన్ని మౌళిక సదుపాయాలు కల్పిస్తామని ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావులు అన్నారు. మండలంలోని జర్జంగి పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలను ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్‌తో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాలు మేరకు ప్రతి శనివారమూ మండలంలో నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలిస్తున్నానని తెలిపారు. అలాగే లబ్ధిదారులు ఇళ్లు వేగవంతం చేయాలన్నారు.


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఫణీంద్రకుమార్

కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ రెడ్డి పాపినాయుడు, విద్యుత్‌శాఖ ఎఇ సురేష్, పిఆర్ ఎఇ లతశ్రీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కావ్య, ఎన్‌ఆర్‌జీఎస్ క్లస్టర్ జెఇ జి.హరిప్రసాద్, సర్పంచ్ అన్నెపు సుశీల పాల్గొన్నారు.


రీ సర్వేను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

రీ సర్వేతో భూ తగాదాలకు చెక్

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

భూ రీ సర్వేతో భూ తగాదాలకు చెక్ పడుతుందని జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో భూ రీ సర్వే కోసం ఉపయోగించిన డ్రోన్‌ను శనివారం పరిశీలించి దాని పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న భూ రక్ష శాశ్వత భూహక్కు పథకం కింద భూములను రీ సర్వే చేయిస్తుందని అన్నారు. ఇప్పటికే పంచాయతీ పరిధిలోని గునాలపాడులో వంద శాతం రీ సర్వే విజయవంతంగా అధికారులు పూర్తి చేశారని అన్నారు. డ్రోన్ ద్వారా అర్థో రెక్టిఫైడ్ ఇమేజ్‌లను సేకరించి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి రైతుల సమక్షంలో రీ సర్వే చేపడతారని తెలిపారు. అధికారులు కోరినప్పుడు భూ యాజమాన్యం స్పందించి క్షేత్రస్థాయికి వెళ్లి తమ సందేహాన్ని నివృత్తి చేసుకొని సర్వేకి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి పాలిన చిరంజీవి, కార్యదర్శి నరేష్, గ్రామ రెవెన్యూ అధికారి షణ్ముఖరావు, సచివాలయ సర్వేయర్ రమేష్ పాల్గొన్నారు.

జెవికె కిట్లు పంపిణీ

లావేరు : మురపాక కెజిబివి పాఠశాలలో జగనన్న విద్యా కానుక-4లో భాగంగా ఆరు నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్స్ పుస్తకాలు, షు, బెల్ట్స్, పదో తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు జగనన్న ఆణి ముత్యాలు పురస్కారాలను ప్రిన్సిపాల్ కె.సుధ అందజేశారు. సర్పంచ్ ప్రతినిధి పెయ్యిల లక్ష్మణరావు, ఎంపిటిసి ప్రతినిధి తేనేల సురేష్ కుమార్, వైసిపి నాయకులు తేనెల విద్యాసాగర్ పాల్గొన్నారు. అలాగే లావేరు పాఠశాలలో ఉప సర్పంచ్ వడ్డి సూర్యకుమార్, విద్య కమిటీ చైర్మన్ మజ్జి రాధ, దాశెట్టి షణ్ముఖ, కోటి జెవికె కిట్లను అందజేశారు.

నవధాన్యాల విత్తనాలు పంపిణీ

ఆమదాలవలస: మండలంలోని చేపేనపేట క్లస్టర్ యూనిట్‌లో ఉన్న గ్రామాలైన జి.కె.వలస, చేపేనపేట, నిమ్మతొర్లివాడ, కొత్తవలస, తొగరాం గ్రామాల్లోని రైతులకు సామూహికంగా నవధాన్యాలు విత్తనాల కిట్లను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శనివారం పంపిణీ చేశారు. ఈ మేరకు చేపేనపేటలో 30 మంది రైతులకు నవధాన్యాలు విత్తనాల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి మాట్లాడుతూ పుడమిలో అన్ని రకాల విత్తనాలను వేసుకోవడం వల్ల తరువాత వేసుకునే ప్రధాన పంటకు అన్ని రకాల సహజ పోషకాలు సమృద్ధిగా అందుతాయని తెలిపారు. ప్రకతి సాగులో నవధాన్యాలు సాగు చాలా అవసరమన్నారు. ఈ ప్రక్రియ వల్ల భూమిలో జీవన ద్రవ్యం ఏర్పడుతుందని, తద్వారా ప్రధాన పంట తెగుళ్ల ,పురుగులు బారి నుంచి తట్టుకుని అధిక దిగుబడి సాధించవచ్చునని తెలిపారు. అలాగే రానున్న ఖరీఫ్ సీజన్‌లో గ్రామాల్లో అధిక విస్తీర్ణంలో ప్రకృతి సాగుని చేపట్టేలా సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి ప్రకృతి సేద్యాని మరింత విస్తరించేలా చేస్తున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.


విత్తనాలను అందజేస్తున్న చిరంజీవి